
సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



శుభస్య శీఘ్రం
సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో అభ్యర్థులు సెంటిమెంట్ జోడిస్తున్నారు. ముహూర్తం నిర్ణయించుకుని మరీ నామినేషన్లు వేస్తున్నారు. - 8లో ▸



డెల్టాలకు నీటి విడుదల
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,100 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
43.0° / 26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	43.0	26.0
కాకినాడ	37.9	27.6
అమలాపురం	40.0	27.0

న్యూస్‌రీల్

మూడో రోజు 10 నామినేషన్లు
రాజమహేంద్రవరం రూరల్: నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మూడో రోజైన శనివారం జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పది మంది అభ్యర్థులు ఆయా రిటర్నింగ్ అధికారుల వద్ద నామినేషన్లు వేశారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాజమండ్రి లోక్‌సభ, గోపాలపురం అసెంబ్లీ స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదన్నారు. అనపర్తి నుంచి లింగం గంగాధర్ (జై భీమ్‌రావు భారత్ పార్టీ), రాజానగరం నుంచి బర్రే ఆనంద కుమార్ (స్వతంత్ర), రాజమండ్రి సిటీ నుంచి మేడా శ్రీనివాసరావు (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్)), రాజమండ్రి రూరల్‌లో బొద్దాపు శివ విష్ణు ప్రసాదరావు (స్వతంత్ర), దుగ్గిరాల శ్రీదేవి (భారత చైతన్య యువజన పార్టీ), కొవ్వూరు(ఎస్సీ)లో ముప్పిడి సుజాత (టీడీపీ), తలారి వెంకట్రావు (వైఎస్సార్ సీపీ) రెండో సెట్ నామినేషన్, నిడదవోలులో ముక్కామల అన్నవర ప్రసాద్ (భారతీయ పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), గెడ్డం సుమలత (వైఎస్సార్ సీపీ), గెడ్డం శ్రీనివాస్ నాయుడు (వైఎస్సార్ సీపీ) రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారని కలెక్టర్ వివరించారు.

25న గురుకులాల ప్రవేశ పరీక్ష
రాజమహేంద్రవరం రూరల్: ఏపీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీ, డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు ఈ నెల 25వ తేదీన ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నారని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. ఏపీఆర్ఎస్ కాట్, ఏపీ ఆర్‌జేసీ-డిగ్రీ కాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో ఆయన తన చాంబర్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నగరంలోని ఆరు కేంద్రాల్లో ఏపీఆర్ఎస్ కాట్ నిర్వహిస్తామన్నారు. రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మూడు కేంద్రాల్లో ఏపీ ఆర్‌జేసీ-డిగ్రీ కాట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఇప్పటికే హాల్ టికెట్లు పంపించారని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు, తాగునీరు, వైద్యం, విద్యుత్ పరంగా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

తపాలా ఓటు.. ఇదీ రూటు

- 12డి ఫారంతో పోస్టల్ బ్యాలెట్
- అత్యవసర విధుల్లో ఉండే వారికి ప్రయోజనం
- ఈసారి 33 విభాగాల ఉద్యోగులకు అవకాశం
- నమోదుకు 23 వరకూ గడువు



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల్లో ప్రతి ఓటూ ఎంతో కీలకమైనదే అవుతుంది. అభ్యర్థుల తలరాతలను ఒక్కోసారి ఒక్క ఓటే మార్చేస్తూంటుంది. అందువల్లనే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటుకూ ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. సాధారణంగా పోలింగ్ రోజున ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేస్తూంటారు. అయితే, అత్యవసర సేవల్లో పని చేసే కొంతమంది ఉద్యోగులకు ఆవిధంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయడం సాధ్యం కాదు. అటువంటి వారి కోసమే పోస్టల్ బ్యాలట్ విధానాన్ని భారత ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. ఈసారి ఏకంగా 33 అత్యవసర సేవా విభాగాల్లో పని చేస్తున్న వారిని గుర్తించి, వారికి ఈ అవకాశం కల్పించింది. పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించాలని, దీనికి సంబంధించి 12డి ఫారం అందుబాటులో ఉంచాలని ఎన్నికల అధికారులను ఆదేశించింది. పోస్టల్ ఓటు కావాలనుకునే వారు ఈ నెల 23వ తేదీలోగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఎవరికంటే..

ప్రయాణికుల రైల్వే, గూడ్స్ రైల్వే, మెట్రో, రవాణా సేవలు, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్స్, దూరదర్శన్, ఆకాశవాణి, రాష్ట్ర మిల్క్ యూనియన్లు, పాల సహకార సంఘాలు, వైద్య, ఆరోగ్య శాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక సేవలు, పోలీస్, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, జైళ్లు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, ట్రెజరీ సేవలు, అటవీ శాఖ, పౌర రక్షణ, హోంగార్డులు, ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ఇంధనం, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్లు, విపత్తు నిర్వహణ, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఎన్నికల కమిషన్ జారీ చేసిన లేఖలతో పోలింగ్ రోజున వార్తలు కవర్ చేసే మీడియా ప్రతినిధులు, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. వీరందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యంపై అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు.

రైల్వేలో 2 వేల మందికి పైగా..

దేశంలో అతి పెద్ద రవాణా వ్యవస్థ రైల్వే. అటువంటి రైల్వేలో లక్షలాది మంది కార్మికులు నిత్యం విధుల్లో ఉంటారు. మొత్తం కార్మికుల్లో వీరి సంఖ్య 70 శాతం వరకూ ఉంటుందని అంచనా. పోలింగ్ రోజున విధుల్లో ఉంటూండటంతో ఇన్నాళ్లూ వీరిలో అత్యధిక శాతం మంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోయేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమకూ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని రైల్వే ఉద్యోగులు చాన్నాళ్లుగా కోరుతున్నారు. ఎట్టకేలకు వారి విజ్ఞప్తులను మన్నించిన ఎన్నికల సంఘం.. వీరికి తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించేందుకు పచ్చ జెండా ఊపింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా నిడదవోలు, కొవ్వూరు, రాజమహేంద్రవరం, అనపర్తి, సామర్లకోట, కాకినాడ, పిఠాపురం, అన్నవరం, తుని వంటి ప్రధాన రైల్వే స్టేషన్లతో పాటు మరికొన్ని చిన్న స్టేషన్లు కూడా ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 5 వేల మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో నిత్యం 2 వేల మందికి పైగా అత్యవసర సేవల్లో ప్రధానంగా లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, గార్డులు, టీటీఈ వంటి రన్నింగ్ స్టాఫ్‌తో పాటు, స్టేషన్ మాస్టర్, ఇతర అత్యవసర విభాగాల వారు విధుల్లో ఉంటారు. వీరికి పోలింగ్ రోజున తమ పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయలేని దుస్థితి. వీరందరికీ ఈసారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది.

ఇలా వినియోగించుకోవాలి

- పోస్టల్ బ్యాలెట్ కావాల్సిన వారికి 12డి ఫారం, 13ఎ, 13బి, 13సి, 13డి కవర్లు ఇస్తారు. ఆ సందర్భంగా ఇచ్చే సూచనలు క్షుణ్ణంగా చదివి, అర్థం చేసుకోవాలి. ఓటరు గుర్తింపు కార్డు, ఉద్యోగి గుర్తింపు కార్డు వంటి అవసరమైన జిరాక్స్ కాపీలు జత చేయాలి.
- 13ఎ కవర్‌లో ఉండే డిక్లరేషన్ ఫారంపై ఓటరు సంతకం చేయాలి. గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలి. బ్యాలెట్ నంబర్, సీరియల్ నంబర్ వేసి, ఆ డిక్లరేషన్ ఫారాన్ని తిరిగి అదే కవర్‌లో పెట్టి అతికించాలి.
- 13బి కవర్‌లో అభ్యర్థులు, పార్టీల పేర్లతో బ్యాలెట్ పేపర్ ఉంటుంది. గుర్తులు ఉండవు. నచ్చిన అభ్యర్థి పేరుకు ఎదురుగా ఓటరు స్కెచ్ పెన్‌తో టిక్ (రైట్ గుర్తు) పెట్టాలి. ఒకరికి మించి టిక్ పెట్టినా, అస్పష్టంగా మార్క్ చేసినా ఆ ఓటు చెల్లుబాటు కాదు. టిక్ పెట్టిన అనంతరం ఆ బ్యాలెట్ పేపర్‌ను తిరిగి 13బి కవర్‌లో పెట్టి అతికించాలి. ఆ కవర్‌పై బ్యాలెట్ పేపర్ సీరియల్ నంబర్ వేయాలి.
- 13ఎ, 13బి కవర్లను 13సి కవర్‌లో పెట్టి అతికించాలి. అనంతరం దీనిని 13డి కవర్‌లో పెట్టి, రిటర్నింగ్ అధికారి చిరునామా రాసి, పోస్టల్ ద్వారా లేదా నేరుగా ఓట్ల లెక్కింపు తేదీలోగా రిటర్నింగ్ అధికారికి అందజేయాలి.
- కొన్నిసార్లు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అక్కడి ఉద్యోగుల సౌకర్యార్థం డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేస్తారు. అందులోనే తమ పోస్టల్ బ్యాలెట్‌ను వేయవచ్చు.

ఎన్నికల విధుల్లో ఉన్నవారికి...



ఎన్నికల రోజున విధుల్లో ఉన్న వారందరికీ పోస్టల్ బ్యాలెట్ ఇస్తారు. అవసరమైన వారు దీనిని ఉపయోగించుకోవచ్చు. జిల్లాలో సుమారు 6 వేల మందికి పైగా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నారు. ఈ జిల్లాలో ఉద్యోగ నిర్వహణలో ఉన్నవారు 12డి ద్వారా పోస్టల్ ఓటు నమోదు చేసుకోవచ్చు. అలాగే ఈ జిల్లాలో ఉంటూ వేరే జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఇక్కడే పోస్టల్ ఓటింగ్ వేయడానికి అవకాశం ఉంటుంది.

– కె.మాధవీలత, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

27న పాలిసెట్
రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశం కోసం ఈ నెల 27న జిల్లాలోని 11 కేంద్రాల్లో పాలిసెట్ నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో తన చాంబర్‌లో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాలిసెట్‌కు జిల్లాలో 5,844 మంది హాజరవుతున్నారని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఆ రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు గంట ముందే చేరుకోవాలని సూచించారు. ఇప్పటికే హాల్ టికెట్లు పంపించారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు, తాగునీరు, పారిశుధ్యం తదితర ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన తగిన వైద్య సిబ్బందిని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని అర్బన్ తహసీల్దార్‌ను ఆదేశించారు. సమావేశంలో జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, డీపీఓ డి.రాంబాబు, నగరపాలక సంస్థ ఈఈ ఎస్‌కే మదర్సా ఆలీ, ఎస్సై కె.నాగేశ్వరరావు, ఈపీడీసీఎల్ ఏఈ ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ ఆరోపణలన్నీ అభూతకల్పనలే

మధురపూడి/రాజానగరం: కోరుకొండ మీటింగ్‌లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తన రాజకీయ ఉనికి కోసం తమపై చేసిన ఆరోపణలన్నీ అభూత కల్పనలేనని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. జక్కంపూడి సోదరులపై పవన్‌కల్యాణ్ చేసిన ఆరోపణలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు శనివారం రాత్రి కోరుకొండ మండలం గాడాలలో రహదారిపై గంటన్నర పాటు ఆందోళన చేపట్టారు. ఆ ప్రాంతానికి భారీగా చేరుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు పవన్‌కల్యాణ్, ఆ పార్టీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ ఆరోపణలను ఆధారాలతో సహా నిరూపిస్తే తాను జిల్లా వదిలి వెళ్లిపోతానని, లేకుంటే మీరు రాజకీయాల నుంచి తప్పుకుంటారా అంటూ పవన్‌కల్యాణ్‌కి చాలెంజ్ చేశారు. సినీ హీరోగా పవన్‌కల్యాణ్ అంటే తమకు అభిమానం ఉందని, కాని తమ పట్ల ఆయన అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు.



గాడాలలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఫ్చ్.. ఇంకా మందకొడిగానే..

- పొగాకు అమ్మకాలపై ఆసక్తి చూపని రైతులు
- క్రమంగా పెరుగుతున్న వర్జీనియా పొగాకు ధర
- ఇప్పటి వరకూ 51.84 లక్షల కిలోల కొనుగోలు



దేవరపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు

దేవరపల్లి: వర్జీనియా పొగాకు అమ్మకాలు ఇంకా మందకొడిగానే జరుగుతున్నాయి. టుబాకో బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ కార్యాలయం పరిధిలోని తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఐదు వేలం కేంద్రాల్లో మార్చి 6న పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. శనివారం నాటికి 33 రోజుల పాటు వేలం నిర్వహించగా కేవలం 51.84 లక్షల కిలోల (5.8 మిలియన్లు) పొగాకు విక్రయాలు జరిగాయి. దాదాపు నెల రోజులు లో గ్రేడ్ పొగాకు కొన్న ట్రేడర్లు.. వారం రోజులుగా మీడియం గ్రేడ్ పొగాకు కొనుగోలు చేస్తున్నారు. లో గ్రేడ్ పొగాకు కిలో గరిష్ట ధర రూ.240, సగటు ధర రూ.239 చొప్పున పలికింది. ఈ ఏడాది ఉత్తర తేలిక నేలల్లో (ఎన్ఎల్ఎస్) 30 శాతం లో గ్రేడ్ పొగాకు ఉత్పత్తి జరిగిందని అధికారులు భావిస్తున్నారు. మొత్తం 67 మిలియన్ల పొగాకు ఉత్పత్తి అవుతుందన్నది ప్రాథమిక అంచనా కాగా, దీనిలో 3 మిలియన్ల కిలోల లో గ్రేడ్ పండి ఉంటుందని చెబుతున్నారు. లో గ్రేడ్ పొగాకుకు కూడా మార్కెట్లో మంచి ధర లభించిందని అధికారులు అంటున్నారు. లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లు దాదాపు పూర్తి కావడంతో ట్రేడర్లు ప్రస్తుతం మధ్య రకం, బ్రైట్ గ్రేడ్ పొగాకు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది కిలో సగటు ధర రూ.254, గరిష్ట ధర రూ.288 చొప్పున రైతులకు లభించింది. శనివారం మార్కెట్లో కిలో గరిష్ట ధర రూ.266, సగటు ధర రూ.240 మాత్రమే పలికింది. దీంతో ముందుగా అమ్ముకున్న రైతులు కిలోకు రూ.25 మేర నష్టపోయారు. ఇప్పటి వరకూ ఐదు వేలం కేంద్రాల్లో సుమారు రూ.124 కోట్ల విలువైన పొగాకు కొనుగోలు చేశారు.

ధర పెరుగుతుందనే ఆశతో..

ఒక్కో వేలం కేంద్రంలో రోజుకు 1,000 నుంచి 1,200 బేళ్ల పొగాకు కొనుగోళ్లు జరగాల్సి ఉంది. అయితే, రైతులు 200 నుంచి 300 బేళ్లు మాత్రమే వేలానికి తీసుకుని వస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పొగాకు ధరలు పెరుగుతున్నాయని, ముందుముందు మరింతగా పెరుగుతాయని రైతులు ఆశిస్తున్నారు. నెల రోజులుగా ధర ఆశాజనకంగా లేకపోవడంతో ఇటీవల ఐదు వేలం కేంద్రాల పరిధిలోని రైతులు జంగారెడ్డిగూడెంలో సమావేశమయ్యారు. మార్కెట్ ఇదే విధంగా కొనసాగితే వేలం నిలుపు చేయాలని, తీర్మానించి, ఆ విషయం బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో ఆలోచనలో పడిన అధికారులు, ట్రేడర్లు.. లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లు నిలుపు చేసి, మధ్య రకం, బ్రైట్ గ్రేడ్ పొగాకు కొంటున్నారు. అంతర్జాతీయంగా వర్జీనియా పొగాకుకు మంచి డిమాండ్ ఉన్నందున భవిష్యత్తులో మంచి ధర లభిస్తుందని రైతు సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. దీంతో ముందుముందు కిలో ధర రూ.300 దాటవచ్చని రైతులు అంచనా వేస్తున్నారు.

పెరిగిన సాగు

పొగాకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గత ఏడాది మార్కెట్లో మంచి ధర పలకడంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది టుబాకో బోర్డు అనుమతించిన దానికంటే అధిక విస్తీర్ణంలో పంట వేశారు. 2023–24లో బోర్డు 49.5 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, 67 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 19,971 హెక్టార్లలో పంట సాగుకు బోర్డు అనుమతించగా అది ఏకంగా 27 వేల హెక్టార్లకు పెరిగిందని అధికారులు చెబుతున్నారు. వేలం కేంద్రాలకు వస్తున్న బేళ్ల సంఖ్య తక్కువగా ఉండటంతో ఇటీవల బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ వేలం కేంద్రాలను సందర్శించి, రైతులతో చర్చలు జరిపారు. బేళ్ల సంఖ్య పెంచాలని, రోజుకు 5 వేల నుంచి 6 వేల బేళ్లు తీసుకుని రావాలని రైతులకు సూచించారు. అయినప్పటికీ రైతులు నిరాసక్తత చూపుతూండటంతో అధికారులు అయోమయంలో పడ్డారు.

ముందుగా అమ్ముకుంటే నష్టపోతున్నారు
ముందుగా పొగాకు అమ్ముకున్న రైతులు నష్టపోతున్నారు. గత వారం మార్కెట్లో కిలో రూ.240 ధర పలకగా, ప్రస్తుతం రూ.266కు చేరింది. అప్పట్లో అమ్ముకున్న రైతులు కిలోకు రూ.25 నష్టపోయారు. ఏటా ఇలాగే జరుగుతోంది. ఈ ఏడాది మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు తోటలు దెబ్బ తిన్నాయి. వాటిని నిలబెట్టడానికి అధికంగా ఖర్చులయ్యాయి. లో గ్రేడ్ ఉత్పత్తి 30 శాతం జరిగింది. ముందు ముందు మార్కెట్లో మంచి ధర వచ్చే అవకాశం ఉంది. గిట్టుబాటు ధర దక్కనందువల్లనే రైతులు వేలం కేంద్రాలకు బేళ్లు తీసుకుని రావడం లేదు.

– కరుటూరి శ్రీనివాస్, అధ్యక్షుడు, పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం, దేవరపల్లి

క్లుప్తంగా

మేనకేశ్వరునికి నంది, గరుడ వాహనాల సమర్పణ


కె.పెదపూడిలో సమర్పించిన గరుడ, నంది వాహనాలు

అంబాజీపేట: మండలంలోని కె.పెదపూడిలో వేంచేసి ఉన్న మేనకేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాలకు దాతలు గరుడ, నంది వాహనాలను శుక్రవారం సమర్పించారు. గరుడ వాహనాన్ని పెయ్యేటి సూర్య వెంకట వీరభద్ర శర్మ జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు రూ.3 లక్షలతో చేయించగా, నంది వాహనాన్ని తాడిమేటి నాగభూషణరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.3 లక్షలతో చేయించి సమర్పించారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి 23న కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2024–25 సంవత్సరానికి బాలికల గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాలు కల్పించగా మిగిలిన సీట్ల భర్తీకి 23వ తేదీ మంగళవారం మండలంలోని బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.వాణీకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బొమ్మూరు, కొవ్వూరు, వీరలంకపల్లి, గోపాలపురం, జగ్గంపేట, ఏలేశ్వరం, పిఠాపురం, తుని, ఎస్ఎం నగర్, పి.వెంకటాపురం, చొల్లంగిపేట, ముమ్మిడివరం, గోడి, రాజోలు గురుకుల పాఠశాలలో 351 ఖాళీలు ఉన్నాయన్నారు. ఖాళీల వివరాలు ఎస్సీ- 220, బీసీ- 31, బీసీ సీ- 67, ఎస్టీ- 23, ఓసీ -10 సీట్లు ఉన్నాయని, వీటిని భర్తీ చేయడానికి నిర్వహించనున్న కౌన్సిలింగ్‌కు తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని రావాలని ప్రిన్సిపాల్ కోరారు.

బాలుడి మృతదేహం లభ్యం


మహేష్ (ఫైల్)

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు సావరం దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద కాలువలో బాలుడి మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అనపర్తి మండలం పేరా రామచంద్రపురానికి చెందిన పప్పు దుర్గా మణికంఠ మహేష్ (15) అనే బాలుడు మండలంలోని కొమరిపాలెం వద్ద ఈ నెల 17వ తేదీన కాలువలో ఈతకు దిగి గల్లంతయ్యాడన్నారు. మూడు రోజుల గాలింపు అనంతరం మృతదేహం లభ్యమైందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి సీహెచ్‌సీకి తరలించినట్లు తెలిపారు.

నన్నయలో యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ద్వారా నిర్వహిస్తున్న పీజీ డిప్లమా ఇన్ యోగా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నామని వీసీ ఆచార్య కె.పద్మరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా సహకారంతో ఈ కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఏడాది కాలవ్యవధితో కూడిన ఈ కోర్సుకు సంబంధించి 50 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న ఏదైనా డిగ్రీ కోర్సు పూర్తి చేసిన యువతీ, యువకులు మే ఆరో తేదీ లోగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు, సిబ్బందికి రూ.ఆరు వేలు, ఇతరులకు రూ. 10 వేలు కోర్సు ఫీజుగా పేర్కొన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చునని ప్రకటనలో పేర్కొన్నారు.

శుభస్య శీఘ్రం..!

- విజయమే లక్ష్యంగా ఎన్నికల సమరానికి అభ్యర్థులు
- మంచి ముహూర్తం కోసం ఆరాటం
- మిగిలింది ఇక నాలుగు రోజులే
- 25వ తేదీ నామినేషన్లకు గడువు



ఆలమూరు: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో రాజకీయ నేతలు తమ సెంటిమెంట్‌ను జోడిస్తున్నారు. తమ నామ, నక్షత్రాలను బట్టి ముహూర్తాలను నిర్ణయించుకుని నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. తమ ఆస్థాన పండితుల చేత ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తమ నామినేషన్లకు ముహూర్తాలను నిర్ణయించుకుని ఆ దిశగా చర్యలు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అధికార పక్షమైన వైఎస్సార్ సీపీతో పాటు టీడీపీ, జనసేన కూటమి, కాంగ్రెస్, బీఎస్పీ, జైభీమ్ భారత్ పార్టీల అభ్యర్థులు తమ గెలుపును ఆకాంక్షిస్తూ ఇప్పటికే ముహూర్తాలు ఖరారు చేసుకున్నారు. ఈ మేరకు భారీ జన సందోహం మధ్య ఆ ముహూర్త వేళలో నామినేషన్లపై సంతకం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 25వ తేదీతో ముగుస్తుండగా 21వ తేదీ ఆదివారం కావడంతో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఇంకా నాలుగు రోజుల గడువు మాత్రమే ఉంది. అయితే ఈ నాలుగు రోజుల్లో నక్షత్ర, నామధేయాన్ని బట్టి ముహూర్తాలు ఉన్నాయని పంచాంగకర్తలు చెబుతున్నారు. గంటల పంచాంగాన్ని బట్టి ఈ నెల 26 వరకూ బ్రహ్మాండమైన శుభకార్యాలు, పెళ్లి ముహూర్తాలు ఉండగా 27న శుక్ర మౌఢ్యమి ప్రవేశిస్తుంది. అయితే రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ 25నే ముగియనుండటంతో మంచి ముహూర్తాలకు ఇబ్బంది లేదు. ఒక వేళ ఇదే సమయంలో మౌఢ్యమి సంభవిస్తే పెట్టుడు ముహూర్తాలను నిర్ణయించుకోవలసిన పరిస్థితి నెలకొనేది.

22వ తేదీనే అధికంగా ముహూర్తాలు

2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి హిందూ పంచాంగం ప్రకారం ఈ నెల 22నే నామినేషన్లు వేసేందుకు మంచి ముహూర్తం ఉందని పంచాంగకర్తలు చెబుతున్నారు. జిల్లాలో వివిధ పార్టీలకు చెందిన నేతలు తమ అభ్యర్థిత్వానికి అదే రోజు ముహూర్తం కావడంతో ఆ సమయంలో నామినేషన్ దాఖలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. అభ్యర్థుల గెలుపు ఓటములను ముహూర్త బలాలు ఏవిధంగా నిర్ణయిస్తాయో వేచి చూడాల్సిందే. పండితులు మాత్రం అందరినీ విజయీభవ అని దీవించి పంపుతున్నారు.

పురోహితులు, పండితులు చెప్తున్న శుభ ముహూర్తాలను పరిశీలిస్తే.. ఈనెల 20వ తేదీన ఉదయం పది నుంచి 11.20 గంటల మధ్య మంచి ముహూర్తం ఉందని చెప్తున్నారు. అలాగే ఈ నెల 22న ఉదయం 9.15 నుంచి 11.15 వరకూ, మధ్యాహ్నం 12.53 నుంచి 2.40 వరకూ, 23న ఉదయం 10.20 ఉంచి 11.20 వరకూ, మధ్యాహ్నం 2.50 నుంచి 4.34 వరకూ, ఈ నెల 24న ఉదయం 9.15 నుంచి 11.00 వరకూ, మధ్యాహ్నం 2.18 నుంచి 4.01 వరకూ, 25న మధ్యాహ్నం 11.00 నుంచి 12.00 వరకూ, 12.12 నుంచి 1.52 వరకూ శుభ ముహూర్తాలు ఉన్నాయని సూచిస్తున్నారు. ఆదివారం మంచి ముహూర్తం ఉన్నా ఆ రోజు సెలవు కావడంతో నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు ముహూర్త బలం బాగున్నా ఆ అవకాశం లేకపోవడం కొంత మంది నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నామినేషన్ల దాఖలులో ఆచితూచి అడుగు

సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారు. ఇంటి నుంచి బయలు దేరే సమయంతో పాటు నామినేషన్ల పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేసే సమయం, నామినేషన్ల సెట్‌పై సంతకాల చేసే సమయంలో కూడా మంచి ముహూర్తం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ ఏదైనా, కులమతాలు ఏమైనా ముహూర్త బలం ఉంటేనే కాని నామినేషన్ల దాఖలుకు ఒక అడుగు కూడా ముందుకు వేసే పరిస్థితి కనిపించడం లేదు.

అడ్డదారే మృత్యు మార్గమైంది

ఎర్రకాలువ నీటిగుంటలో ఉపాధి కూలీ మృతి


ఎర్రకాలువ నీటిగుంటలో పడి మృతిచెందిన మారయ్య

నల్లజర్ల: ఇంటి దగ్గర ఆవు ఈనుతోందని కబురు రావడంతో ఉపాధి కూలీ మర్రి మారయ్య (57) అడ్డదారిన గమ్యాన్ని చేరడానికి ప్రయత్నించి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు మారయ్య శనివారం ఉదయాన్నే ఉపాధి పనికి వెళ్లాడు.ఇంటి దగ్గర ఆవు ఈనుతోందని సమాచారం రావడంతో హడావిడిగా బయలుదేరాడు. మార్గం మధ్యలో ఎర్రకాలువ అడ్డుగా ఉంది. తిరిగి రావాలంటే 3 కిలోమీటర్ల దూరం నడవాలి. దీంతో దగ్గర దారి ఎంచుకున్నాడు. తీరా కాలువలోకి దిగేసరికి నీటి గుంట లోతు ఎక్కువగా ఉందనే విషయాన్ని గమనించేలోగా మునిగిపోయాడు. సమీపంలో పశువుల కాపరులు ఈ విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ల సాయంతో మారయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. మారయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

పోటెత్తిన వాడపల్లి వెంకన్న ఆలయం


భక్తులతో పోటెత్తిన ఆలయం


ప్రత్యేకాలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి

- రూ.35.11 లక్షల ఆదాయం
- ఏర్పాట్లు చేసిన అధికారులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులు పోటెత్తింది. స్వామి వారు భక్తులకు పూర్ణ అలంకరణలో దర్శనమిచ్చారు. రాష్ట్ర నలుమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అవరణలోని క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరుని సైతం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కల్యాణాలకు, ఏడు వారాల ప్రదక్షిణలకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాగణంలో కిక్కిరిసింది. డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రత్యేకదర్శనం, అన్నప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.35,11,556 ఆదాయం సమకూరిందని, అన్నసమారాధనలో వేలాది మంది పాల్గొన్నారని ఈఓ తెలిపారు.

శోభాయమానంగా పొన్నవాహనోత్సవం

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం పొన్నవాహనోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రత్నగిరిపై ధ్వజస్తంభానికి పుష్పాధివాసం


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో భాగంగా పూజలు, హోమాలు చేస్తున్న పండితులు

అన్నవరం: సత్యదేవుని ఆలయంలో నూతన స్వర్ణ ధ్వజస్తంభం ప్రతిష్ఠకు పూజలు, హోమాలు సాగుతున్నాయి. పాత ధ్వజస్తంభం నుంచి సేకరించిన కళలకు శనివారం పుష్పాధివాసం చేశారు.

సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ దంపతులు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ వ్యయాన్ని భరిస్తున్న నెల్లూరుకు చెందిన భక్తుని దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, ముష్టి పురుషోత్తం, వ్రతపురోహిత ప్రముఖులు వైదిక కమిటీ సభ్యుడు చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి, ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చకులు శర్మ, సుధీర్ తదితరులు పూజలు నిర్వహించారు.

నేడు ధాన్యాదివాసం

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భాగంగా ఆదివారం ధ్యాన్యాధివాసం నిర్వహించనున్నారు. 22వ తేదీ ఉదయం 10.48 గంటలకు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. అనంతరం ఆ స్తంభానికి రాగిరేకు అమర్చి తదుపరి స్వర్ణరేకు తాపడం చేయనున్నారు. ఎన్నికల నిబంధనల కారణంగా ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరుకావడం లేదు.

ఫలితమేదైనా భవితకు బాటలేద్దాం

- ఆందోళన అనర్థాలకు హేతువు
- మార్కులు ప్రామాణికం కానేకాదు
- పదవ తరగతితోనూ ఉద్యోగాలు



రాయవరం: జిల్లాలో విద్యార్థులు పలు పరీక్షలు ఎదుర్కొన్నారు. వాటిలో జీవితంలో మొదటిది పదో తరగతి. సోమవారం ఆ పరీక్ష ఫలితాలు రాబోతున్నాయి. ఈ ఫలితాల అనంతరం పాలిటెక్నిక్, ఇంటర్మీడియేట్, ఐటీఐ వంటి కోర్సుల్లో చేరడానికి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సుల్లో చేరడానికి సమాయత్తం కావాల్సి ఉంది. ఇంటర్ ఫలితాలు ఇప్పటికే విడుదల కాగా, పదో తరగతి ఫలితాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఫలితం తారుమారైతే కొంపలు అంటుకుపోయేదేమీ లేదని విద్యార్థులు గ్రహించాలి. తదుపరి కార్యాచరణకు సమాయత్తం కావాలి. చదువు కొనసాగించాలా.. ఎలా ప్రణాళిక వేసుకోవాలి.. లేదా ఉన్న చదువుతోనే ఉపాధి వెతుక్కోవాలా.. అవకాశాలు ఎక్కడ ఉంటాయి తదితర అంశాలపై విద్యావేత్తలు పలు సూచనలిస్తున్నారు.

మళ్లీ ప్రయత్నించాలి

పరీక్షలు బాగానే రాసినా ఫలితంపై ఆందోళన అందరిలోనూ ఉంటుంది. వాటి ప్రభావంతో పలువురు విద్యార్థులు కుంగుబాటుకు గురవుతుంటారు. అయినా కుంగిపోకుండా మరోసారి ధైర్యంగా ప్రయత్నించాలి. తల్లిదండ్రులు పిల్లల భవితపై ఆశతో, విద్యా సంస్థల యాజమాన్యాలు వాటి ప్రగతికి ఆరాటపడుతుంటారు. ప్రాచుర్యం కోసం మంచి ఫలితాల కోసం ఆరాటపడుతుంటారు. దీంతో ఒత్తిడికి గురవుతారు. అయితే ఏ ప్రగతికైనా మార్కులే ప్రధానం కాదని అందరూ గుర్తించాలి.

మార్కులే ప్రామాణికం కాదు

ఫలితాల్లో మార్కులే ప్రాతిపదికగా చాలామంది భావిస్తారు కానీ, అత్తెసరు మార్కులు వచ్చినా సరే.. ఎందరో వారి జీవితాల్లో రాణించారని గుర్తించాలి. సర్టిఫికెట్లు కేవలం విద్యార్హత తెలిపేవి మాత్రమేననే విషయాన్ని గ్రహించాలి.

పదో తరగతితోనూ ఉద్యోగ అవకాశాలు

పదో తరగతి విద్యార్హతతోనూ పలు ఉద్యోగాలు సాధించవచ్చు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, రైల్వే, తపాలా తదితర శాఖల్లో ఉద్యోగాలను పొందే అవకాశముంది. ఈ విద్యార్హతతో ఉద్యోగాన్ని సాధించి, అనంతరం శాఖాపరమైన పరీక్షల్లో ప్రతిభ చూపి ఉన్నత స్థానాలకు చేరే అవకాశముంది.

వీళ్లు కదా మనకు ఆదర్శం..

మైక్రో సాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ హార్వర్డ్ యూనివర్సిటీ డ్రాపవుట్ విద్యార్థి. మొదట ట్రాఫ్-ఓ-డేటా అనే వ్యాపారానికి సహ భాగస్వామిగా ఉండేవాడు. తదనంతరం కంప్యూటర్ ప్రోగ్రామింగ్ పట్ల అభిరుచి, నైపుణ్యంతో తన వైఫల్యాలను విజయాలుగా మార్చుకుని, మైక్రోసాఫ్ట్ కంపెనీకి మార్గదర్శకుడయ్యాడు. 31 ఏళ్ల పిన్న వయసులోనే బిలియనీర్‌గా మారాడు.

జుకర్‌బర్గ్

ఫేస్‌బుక్ రూపొందించిన జుకర్‌బర్గ్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువును మధ్యలో నిలిపివేశాడు. చిన్నతనంలో నేర్చుకున్న ప్రోగ్రామింగ్ ద్వారా తనలో సృజనాత్మక ఆలోచనలతో ఫేస్‌బుక్‌ను రూపొందించి, అపర కుబేరుడయ్యాడు.

వాట్సప్ సృష్టికర్త

స్మార్ట్‌ఫోన్‌లో నిత్యావసరం అయిపోయిన వాట్సప్ రూపకర్త జాన్‌కెమ్ యాహూలో ఉద్యోగం కోసం చదువును మధ్యలోనే వదిలేశారు. తల్లిని కోల్పోయి ఒంటరితనంతో బాధపడుతున్న ఆయనను స్నేహితుడు ఆదరించాడు. అతడితో కలిసి రూపొందించిన వాట్సాప్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అలాగే అబ్రహం లింకన్, థామస్ ఆల్వా ఎడిసన్, కల్నల్ శాండర్స్, ఫోర్డ్, నిక్ ఉజుచ్ ఇలా ఎందరో చదువుల్లో విఫలమై జీవితంలో అజేయంగా నిలిచారు.

రేపు పదో తరగతి ఫలితాల విడుదల



రాయవరం: పదో తరగతి ఫలితాలు ఈ నెల 22న విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. సోమవారం ఉదయం 11 గంటలకు ఈ ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి.దేవానందరెడ్డి నుంచి ఈ మేరకు జిల్లాలకు ఆదేశాలు అందాయి. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించగా, మూల్యాంకనం ఈ నెల ఎనిమిదో తేదీన ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 112 పరీక్షా కేంద్రాల్లో ఇప్పటికే ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో కేవలం 20 రోజుల్లోనే పదో తరగతి ఫలితాలు విడుదల చేయనున్నారు.